క్లుప్తంగా

కాంగ్రెస్ దోషిగా నిలిచినట్టే



నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిలో దోషిగా నిలిచినట్టేనని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022–23లో 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ముసుగులో ప్రభుత్వ పెద్దలే బినామీలుగా రూ.1100 కోట్ల కుంభకోణానికి తెరలేపారని, ఆ విషయమై హైకోర్టులో పిల్ దాఖలు చేయగా నోటీసులు ముట్టి 20 నెలలు గడుస్తుండగా ప్రభుత్వం 18 సార్లు వాయిదా కోరిందని తెలిపారు. తద్వారా దోషిగా నిలబడినట్లేనని తెలిపారు. కేసును ఆలస్యం చేస్తున్న, బాధ్యులైన సీఎం రేవంత్‌రెడ్డి, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతిపై కాంగ్రెస్ అష్ట దిగ్బంధనంలో ఇరుక్కుపోవడం బీఆర్‌ఎస్ సాధించిన విజయమన్నారు. కాంగ్రెస్ పెద్దలు కాజేసిన సొమ్మును కక్కిస్తామన్నారు.

జీపీఓలు అంకితభావంతో పని చేయాలి



ఖానాపురం : అంకితభావంతో పని చేయాలని తహసీల్దార్ రమేశ్ జీపీఓలకు చెప్పారు. మండలానికి నియమితులైన జీపీఓలు తహసీల్దార్‌కు బుధవారం విధుల్లో చేరిక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. శ్రద్ధగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. తహసీల్దార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు స్వామి, గాయత్రి, జీపీఓలు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వనదర్శిని

ఖానాపురం : నర్సంపేటలోని గీతాంజలి డీజీ స్కూల్ యాజమాన్యం బుధవారం వనదర్శిని కార్యక్రమం నిర్వహించింది. విద్యార్థులను మండలంలోని పాకాలలోని అడవులకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ మాట్లాడారు. వనమహోత్సవం ద్వారా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. నాటిన మొక్కలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులతో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటించేలా చొరవ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాహుల్, అటవీ శాఖ ఉద్యోగులు విజయ్, శ్రీకాంత్, మహేశ్, ప్రకాశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు



నల్లబెల్లి/నెక్కొండ/గీసుకొండ/రాయపర్తి : నల్లబెల్లి, నెక్కొండ, గీసుకొండ, రాయపర్తి మండలాల్లో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. నల్లబెల్లిలోని బస్టాండ్ ఆవరణలో విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు ఆసం చంద్రమౌళి జెండా ఎగరేశారు. ప్రయాణికులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గీసుకొండ మండలంలోని ధర్మారంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కన్వీనర్ కొక్కొండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో యజ్ఞమహోత్సవం నిర్వహించగా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బండ్లోజు నర్సింహాచారి, రాష్ట్ర కార్యదర్శి సొల్లేటి కృష్ణమాచారి, తదితరులు పూజలు నిర్వహించారు.

అవగాహన పెంచుకోండి

రాయపర్తి : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీఓ వెన్నంపల్లి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఊకల్ ప్రభుత్వ స్కూల్‌లో 'బాలికల అక్రమ రవాణా, బాలలపై లైంగిక దాడి, సైబర్ మోసాల పై బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం విఠోబా, ఉపాధ్యాయులు సంకూరి రాజు, అరుణ, శిరీష, అనిత, సంధ్య, స్వర్ణలత, రాజేశ్వరి, విజయ, యాకయ్య, కట్ట శ్రీనివాస్, రామ్మూర్తి, సీఆర్పీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడలకు ఎంపిక

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నేటి (ఈనెల 18) నుంచి రెండ్రోజులపాటు జోనల్ ఎస్‌జీఎఫ్ఐ క్రీడలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు ప్రధాన కార్యదర్శి బొల్లేపెల్లి వీరస్వామి, పీఈటీ, హెచ్ఎం వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడల్లో పాల్గొనేందుకు విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్ తోపాటు ఆధార్ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

సబ్‌మార్కెట్ అభివృద్ధికి అడుగులు

● రూ.1.20 కోట్లు మంజూరు

ఖానాపురం : మండలంలోని సబ్‌మార్కెట్ యార్డు అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. గతంలో ఆయకట్టు రైతులకు సబ్‌మార్కెట్ యార్డులో సరైన వసతులు కరువయ్యాయి. అనేక ఏండ్లు గడుస్తున్నా ఆధునీకరణకు నోచుకోలేదు. తాజాగా వైస్‌చైర్మన్ శాఖమూరి హరిబాబు చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

పాకాల ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇందులో మండల పరిధిలో 18 వేలకుపైగా వరి సాగవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి పంట కోసిన తర్వాత ఆరబెట్టుకునే క్రమంలో సబ్‌మార్కెట్ యార్డులో ఆరబెట్టుకోవడానికి సరైన వసతులు లేకపోవడంతోపాటు స్థలం సరిపోని దుస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యను పాలకవర్గం ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు అందించారు. దీంతో ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది.



ఖానాపురంలోని సబ్‌మార్కెట్ యార్డు

వసతులు కల్పిస్తాం



గత ప్రభుత్వం సబ్‌మార్కెట్ యార్డు అభివృద్ధిని పట్టించుకోలేదు. యార్డులో అవసరమైన మరమ్మతులు, ఆధునీకరణ పనులు చేపట్టి రైతులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించాము. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి కానుంది.

– శాఖమూరి హరిబాబు, వైస్‌చైర్మన్

త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టనున్నారు. మరో రూ.80 లక్షలు మంజూరు చేయించే దిశగా ప్రత్యేక కార్యాచరణ సాగుతోంది.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

● వైద్యకళాశాల నేత్ర వైద్యురాలు సింధూరి

ఖానాపురం : ప్రభుత్వ ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని నర్సంపేట వైద్యకళాశాల నేత్ర వైద్యురాలు సింధూరి కోరారు. స్వస్థనారి సశక్త పరివార అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పలువురికి నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలు ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజయ్య, నర్సింగ్ ఆఫీసర్ చిన్ని, సబిత, ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాసచారి, సిబ్బంది దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సింధూరి

‘అంగన్‌వాడీ’ల్లో ఆటపాటలతో బోధించాలి



నర్సంపేట : అంగన్‌వాడీ టీచర్లతో సీడీపీఓ మధురిమ, సూపర్‌వైజర్లు, తదితరులు

● ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ

నర్సంపేట : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ కోరారు. పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ అభియాన్, పోషణ్ బీ పడాయిబీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. పిల్లలకు సరళమైన రీతిలో బోధించేందుకు కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట సెక్టార్ సూపర్‌వైజర్ రమ, మాధవి, వాసంతి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నీరజ, ప్రసూన, హేమలత మాట్లాడారు. విద్యార్థులకు ఆకలి పరీక్ష, ఎస్‌ఆర్‌సీ రెఫరెన్స్, తదితరాలు నిర్వహించనున్నట్టు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు కార్యక్రమాన్ని ప్రణాళికాయుతంగా నిర్వహిస్తూ విజయవంతం చేయాలని సూచించారు.

ఒత్తిడి తగ్గించేలా టైమ్ టేబుల్

● మైనార్టీ గురుకుల స్కూల్ హెచ్ఎం శ్రీపాల

నర్సంపేట : ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా మైనార్టీ గురుకుల స్కూల్, కళాశాలల నూతన టైమ్ టేబుల్ తయారు చేసినట్టు స్థానిక మైనార్టీ గురుకుల స్కూల్ హెచ్ఎం శ్రీపాల తెలిపారు. స్థానిక స్కూల్‌లో టైమ్ టేబుల్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. నూతన టైమ్ టేబుల్ అధ్యాపకులకు సైతం సాంత్వన కలిగించేలా ఉందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా నూతన టైమ్ టేబుల్ తయారు చేయడంలో ఎమ్మెల్యే శ్రీపాల్‌రెడ్డి చొరవ చూపారంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడం సాంబయ్య, శీలం మల్లయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శాన ఉమా మహేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత శ్యామ్ ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఓడెల సురేందర్, మండలం మహిళా కార్యదర్శి కల్పనదేవి, తదితరులు పాల్గొన్నారు.



టైమ్ టేబుల్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, టీచర్లు

లారీ యజమానుల సంఘం కమిటీ ఎన్నిక

నర్సంపేట : నర్సంపేట డివిజన్ లారీ యజమానుల సంఘం నూతన కమిటీని స్థానిక కార్యాలయంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదగోని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోమటినేని వెంకటరావు, కోశాధికారిగా గుండెబోయిన హరిప్రసాద్, ఉపాధ్యక్షుడుగా భూక్య రాజు, సహాయ కార్యదర్శిగా భూక్య సుమన్, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం కమిటీని స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఫుడ్ గ్రీన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శింగిరికొండ మాధవ శంకర్, ఇరుకు కోటేశ్వర్‌రావు, భూపాల్‌రావు, గంధం నరేందర్, దొడ్డ వేణు తదితరులు పాల్గొన్నారు.

తాపీ సంఘం కార్యవర్గం..

నల్లబెల్లి : తాపీ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన క్యాతం మొగిలి రెండోసారి ఎన్నికయ్యాడు. అలాగే ఉపాధ్యక్షుడిగా రెడ్డి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బయ్య కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా కదిరిక రాజిరు, కోశాధికారిగా శ్యామల లక్ష్మీనారాయణ, సభ్యులుగా బండి సారయ్య, గాదర్ల మల్లయ్య, గాజుల ప్రభాకర్, ఎలుకపెల్లి చింటు, దార స్వామి, బాషబోయిన ఎల్లస్వామి ఎన్నికయ్యారు.



నర్సంపేట : కమిటీని సన్మానిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులు

ప్రభుత్వ స్కూల్‌లో క్షుద్రపూజల కలకలం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో క్షుద్రపూజల కలకలం బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా.. పాఠశాల గది ఎదుట మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు నిర్వహించారు. ఉదయం స్కూల్‌కు వచ్చిన విద్యార్థులకు భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయుల ఫిర్యాదుతో పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. ఆకతాయిల పనిగా ప్రచారంలో ఉంది. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తరగతి గది ముందు పసుపు, కుంకుమ

ప్రధాని మోదీ జన్మదినం



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, నల్లబెల్లి, ఖానాపురం, రాయపర్తి మండలాల్లో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. రక్తదాన, వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రధానిగా నరేంద్ర మోదీ అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కక్ర శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొడ్డెమ్మకు పూజలు



రాయపర్తి : మండలంలోని మైలారంలో బుధవారం బొడ్డెమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆడిపాడారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట : స్థానిక మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా పని చేసి డివిజనల్ పంచాయతీ అధికారి (డీపీఓ)గా పదోన్నతిపై జగిత్యాల జిల్లా కోరుట్లకు బదిలీ అయిన అంకం ధనలక్ష్మిని జిల్లా, మండల కార్యాలయాల్లో బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. మరింత ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, ఎంపీడీఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ కోకన్వీనర్‌గా సురేందర్

నల్లబెల్లి : లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నర్సంపేట డివిజన్ కోకన్వీనర్‌గా మండలంలోని ముచ్చింపుల తండాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గుగులోత్ సురేందర్ నాయక్‌ను మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడారు. లంబాడీ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

ఇద్దరికి గాయాలు

నర్సంపేట : ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొట్టగా ఇద్దరికి గాయాలైన ఘటన ఘటన చెన్నారావుపేట మండల కేంద్ర శివారులోని పెట్రోల్ పంపు వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గొల్లపల్లికి చెందిన బ్యాంకు ఉద్యోగి భూక్య శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై నర్సంపేట దిశగా వెళ్తుండగా నెక్కొండ మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన పాల వ్యాపారి జరుపుల సారయ్య బైక్ ఒకదాన్ని మరొకట్టి ఢీకొన్నాయి. శ్రీకాంత్ కాలికి, సారయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు టీ షర్ట్స్ అందజేత

నెక్కొండ : మండలంలోని అప్పల్‌రావుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చందా శోభారాణి తన సొంత డబ్బుతో సమకూర్చిన టీ షర్టులను స్థానిక మండల పరిషత్ ప్రాథమిక స్కూల్ విద్యార్థులకు ఎంఈఓ భూక్య రవికుమార్ బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయురాలు శోభారాణిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రంగారావు, జాన్‌నాయక్, ఏఏపీసీ చైర్మన్ వినోద, ఉపాధ్యాయులు భిక్షపతి, భారతి, మాలతి, కుమార్, భద్రు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పెర్కవేడు హైస్కూల్‌లో..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు వరంగల్ ఉర్సుగుట్ట ప్రాంతానికి చెందిన మురళీకృష్ణ సమకూర్చిన రూ.5 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను హెచ్ఎం శ్రీనివాసులు చేతుల మీదుగా అందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడారు. మురళీకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, రమేశ్, నరేందర్, సమ్మయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : జాతీయ జెండాను ఎగరవేసి వందన సమర్పన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



వర్ధన్నపేట: జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు



నల్లబెల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో..



సంగెం : ఎంపీడీఓ కార్యాలయంలో..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, పట్టణాల్లో, పల్లెల్లోని ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. నర్సంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జెండా ఆవిష్కరిచి మాట్లాడారు. గడీల కోటలను బద్దలు కొట్టి రాచరిక పాలనకు చరమగీతం పాడి ప్రజాపాలన అందిస్తున్నామని చెప్పారు. వర్ధన్నపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ విమోచన వేడుకలు

నర్సంపేట/వర్ధన్నపేట/సంగెం/దుగ్గొండి/గీసుకొండ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, దుగ్గొండి, గీసుకొండ మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలు నిర్వహించారు. నర్సంపేటలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి జాతీయ జెండా ఎగరేసి ప్రసంగించారు. వర్ధన్నపేటలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

నర్సంపేట : ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ జెండా ఎగరేశారు. అనంతరం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు సోల్తి రవి మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ భూక్య శ్రావణ్ కుమార్, మాజీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, నాయకులు సంతోశ్, సిద్ధూ, ఓంప్రకాశ్, జగన్, ప్రవీణ్, ఆకాశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

పోరాట వారోత్సవాలు నిర్వహించండి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి

నర్సంపేట : ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి కోరారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సభకు కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. 1945 నుంచి 1951 వరకు పోరాటం కొనసాగిందని, 4 వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, పేదలకు 10 లక్షల ఎకరాల భూములను పంచామని చెప్పారు. నాలుగు వేల గ్రామాల్లో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాటం సాగిందని తెలిపారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి మాట్లాడుతూ నాడు బ్రిటీశ్, నిజాం, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, కత్తి కట్టయ్య, సూరయ్య, ఫరీదా, రుద్రారపు లక్ష్మి, పెండ్యాల సారయ్య, బేసిక మొగిలి, గొనె మల్లారెడ్డి, అన్వర్, వజ్జతి విజయ, జగన్నాథం, కార్తీక్, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, గణిపాక విలియం కేరీ, యాకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

‘విద్రోహ దినంగా పాటించాలి’

నర్సంపేట : సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా పాటించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా మూడు వేల గ్రామాలు విముక్తి పొందాయని, పది లక్షల ఎకరాల భూములు పేదలకు దక్కాయని చెప్పారు. వేలాది మంది అమరులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్, కట్టయ్య, మనోహర్‌చారి, రాజేందర్, బాలరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ కార్యాలయంలో..

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మొగిలి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆబర్ల రాజన్న, మధు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి, తదితరులు పాల్గొన్నారు.

జలకళపై హర్షం

వర్ధన్నపేట : గత వారం రోజులుగా కోనాయిచలం నుంచి వచ్చే కట్టుకాల్వ పనులను అధికారులు క్లియర్ చేయడంతో బుధవారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కొనారెడ్డి చెరువులోకి నీరు రాగా జలకళ సంతరించుకోవడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే నాగరాజు క్యాంపు కార్యాలయం నుంచి కట్టు కాల్వ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కట్టుకాల్వ మరమ్మతులకు కృషి చేశారంటూ ఎమ్మెల్యే నాగరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ వర్ధన్నపేట మున్సిపల్ కమిటీ ఇన్‌చార్జ్ అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పత్రి భానుప్రసాద్, నాయకులు పోలేపల్లి బుచ్చిరెడ్డి, శ్రీపాద సతీశ్, సిలివేరు శ్రీధర్ యాదవ్, పులి శ్రీనివాస్, మల్లెపాక సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట : ఈనెల 21న హనుమకొండలో నిర్వహించనున్న అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను చెన్నారావుపేటలో సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మాంకాల యాదగిరి బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ లీగల్ అథారిటీ ఇన్‌చార్జి అధ్యక్షుడు యాదగిరి, కన్వీనర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి : అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వల్లందాస్ కుమార్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా కన్వీనర్ మాంకాల యాదగిరి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొట్ల కనకరాజు, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.